# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 14-04-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో నిన్న జరిగిన పేలుడులో ఎనిమిది మంది మృతి చెందగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లులో పర్యటించనున్నారు.**
3. **తెలంగాణలో నేటి నుంచి షెడ్యూల్ కులాల వర్గీకరణ అమలుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయనుంది.**
4. **ప్రజల భూములకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా భూభారతి పోర్టల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు.**
5. **రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతిని ఈరోజు దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో నిన్న జరిగిన అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ముగ్గురు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో, ఐదుగురు విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 15లక్షల రూపాయలు, కేంద్ర ప్రభుత్వం 2 లక్షల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించాయి. ఈ ఘటనపై విచారణ చేయిస్తామని హోంశాఖ మంత్రి వి.అనిత పేర్కొంటూ...

..వాయిస్...27 సెకన్లు....

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లులో ఈ రోజు పర్యటించనున్నారు. సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. "అంబేద్కర్ విదేశీ విద్యా పథకం" కింద రుణాలు తీసుకుని చదువుకుంటున్న విద్యార్థులతో వర్చువల్ సమావేశం నిర్వహిస్తారు.

అనంతరం పీ-4 కార్యక్రమంలో పాల్గొని "మార్గదర్శి-బంగారు కుటుంబం" లబ్దిదారులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. తర్వాత పార్టీ శ్రేణుల సమావేశంలో పాల్గొని సాయంత్రం 4 గంటలకు పొన్నెకల్లు నుంచి హెలికాప్టర్‌లో ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ఏడాది కాలంలో 3 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. నిన్న మంగళగిరిలో నిర్వహించిన మన ఇల్లు- మన లోకేశ్ కార్యక్రమం తొలి దశ చివరి రోజున ఆయన మాట్లాడుతూ.. మంగళగిరి.. అన్ని రంగాల్లో ముందుండేలా చూసే బాధ్యత, తనదని చెప్పారు. మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రికి లోకేశ్ భూమిపూజ చేశారు. అనంతరం టిడ్కో నివాసాల వద్ద ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తామని లోకేశ్ తెలియజేస్తూ..

.. వాయిస్...32 సెకన్లు....

---------------------------

తెలంగాణలో నేటి నుంచి షెడ్యూల్ కులాల వర్గీకరణ అమలు కానుంది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజును వర్గీకరణ అమలు తేదీగా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయనుంది. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నిన్న హైదరాబాద్‌లో సమావేశమైంది. ఉత్తర్వుల తొలికాపీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి అందజేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎస్సీ రిజర్వేషన్లు పెంచే విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

---------------------------

ప్రజల భూములకు భద్రత, భరోసా కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. భూభారతి పోర్టల్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈరోజు సాయంకాలం ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం నూతన రెవెన్యూ చట్టం భూభారతి-2025 అమలులోకి వస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేసి సమస్యల్ని పరిష్కరిస్తామని.. జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు "గ్రామీణ సడక్ యోజన" ద్వారా రహదారుల నిర్మాణం చేపడుతున్నాయని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలంలో 30 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న జల్ జీవన్ మిషన్, రహదారులు, డ్రైనేజీ పనులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి రామానాయుడుతో కలిసి శ్రీనివాస్ వర్మ శంకుస్థాపన చేశారు. అనంతరం యలమంచిలిలో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామని వివరించారు.

---------------------------

శత్రువుల క్షిపణులు, డ్రోన్లు, చిన్నపాటి అస్త్రాలను క్షణాల్లో నేలకూల్చే అద్భుత లేజర్ వ్యవస్థను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ..డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్‌లో నిన్న ఈ పరీక్ష జరిగింది. దీంతో అత్యంత శక్తిమంతమైన లేజర్– డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్.. డీఈడబ్ల్యూ వ్యవస్థ కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత్ చేరినట్లయింది. ఈ ఆయుధాన్ని హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో ల్యాబ్.. సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్..చెస్ అభివృద్ధి చేసింది. ఈ ఆయుధానికి మార్క్–2 ఏ డీఈడబ్ల్యూ అని పేరు పెట్టారు. తాజా పరీక్షలో ఈ అస్త్రం తన పూర్తిస్థాయి సామర్థ్యాన్ని చాటిందని డీఆర్‌డీవో ఒక ప్రకటనలో పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో నిన్న అకాలవర్షాలకు తోడు ఈదురు గాలులు, వడగండ్ల వర్షాల కారణంగా ఆరబెట్టిన బర్లీ పొగాకు, కళ్లాల్లోని మిరప, వరి పంటలకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్న రైతులూ నష్టపోయారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మామిడి పెద్దఎత్తున నేలరాలింది. ప్రకాశం జిల్లా కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని శంకవరంలో గోడ కూలి ఓ మహిళ మృతి చెందింది. అత్యధికంగా అనకాపల్లిలో 54.75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏలూరు, ప్రకాశం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, గుంటూరు, బాపట్ల, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అటు తెలంగాణాలోనూ నిన్న కురిసిన వర్షాలతో జనగామ, సిద్దిపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పది వేలకు పైగా ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. వడగళ్ల వానలతో పలు గ్రామాల్లో మామిడికాయలు, ధాన్యం గింజలు రాలిపోయాయి. పలుచోట్ల వ్యవసాయ మార్కెట్లకు రైతులు తెచ్చిన ధాన్యం వాననీటికి కొట్టుకుపోయింది.

---------------------------

భారతరత్న, రాజ్యాంగ రూపశిల్పి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం జరిపిన డాక్టర్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ 134వ జయంతి ఈరోజు, ఈ సందర్భంగా దేశానికి ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. దేశంలో సామాజిక, ఆర్థిక సాధికారత కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన డాక్టర్ అంబేద్కర్ 1891వ సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన ప్రస్తుత మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని 'మౌ' అనే గ్రామంలో జన్మించారు. కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించి డాక్టరేట్ పట్టాలను పొందారు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశారు. న్యాయవాదిగా, అధ్యాపకునిగా, ఆర్థికవేత్తగా కూడా పనిచేశారు. తదనంతరం భారతదేశ స్వాతంత్ర్యం, పత్రికల ప్రచురణ, దళితుల, సామాజిక, రాజకీయ హక్కులు, భాతరదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం అకుంఠిత కృషి చేశారు. భారతదేశ మొట్టమొదటి న్యాయశాఖా మంత్రిగా పనిచేశారు. 1956 డిసెంబర్ 6వ తేదీన తన 65వ సంవత్సరంలో తుదిశ్వాస విడిచారు. ఆయన దేశానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆ మహనీయుని మరణానంతరం అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న"తో సత్కరించింది. పార్లమెంటులో ఒక సందర్భంలో అంబేద్కర్ చేసిన ప్రసంగాన్ని ఇప్పుడు విందాం...

వాయిస్ 22 సెకన్లు

=====================